
సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 19 । మే । 2023



నేటి నుంచి వలంటీర్లకు వందనం

విస్తృత సేవలందించిన వలంటీర్లను నేడు జిల్లా కేంద్రంలోని నాగయ్య కళాక్షేత్రంలో సత్కరించనున్నారు. -IIలో



పరుగుల సునామీ

చంద్రగిరి ఐపీఎల్‌లో భాగంగా గురువారం 52 మ్యాచ్‌లు నిర్వహించగా క్రీడాకారులు పరుగుల సునామీ సృష్టించారు. -10లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	41	27
తిరుపతి	42	28
తిరుమల	36	23
గూడూరు	43	29
నగరి	42	28

న్యూస్‌రీల్

వెకేషన్ కోర్టు 2వ షెడ్యూల్ విడుదల

తిరుపతి లీగల్ : కోర్టులకు వేసవి సెలవులు ప్రారంభం కావడంతో అత్యవసర కేసులను దాఖలుచేసి ఉత్తర్వులు పొందడానికి జిల్లా కోర్టు చిత్తూరు, తిరుపతి, మదనపల్లి, పీలేరులో వెకేషన్ కోర్టు బెంచ్‌లను ఏర్పాటు చేసింది. ఇదివరలో మొదటి షెడ్యూల్‌ను చిత్తూరు మొదటి అదనపు జిల్లా జడ్జి విడుదల చేసిన విషయం తెల్సిందే. ఈనెల 31 నుంచి జూన్ 12వ తేదీ వరకు వెకేషన్ కోర్టు జడ్జిగా తిరుపతి 5వ అదనపు జిల్లా జడ్జి జి.అన్వర్ బాషా వ్యవహరించనున్నారు. ఈనెల 31 నుంచి ఏయే ప్రాంతాల్లో వెకేషన్ కోర్టు బెంచ్‌ను నిర్వహించేది ఆయన షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 31, జూన్ 7 తేదీలలో చిత్తూరులోనూ, ఈనెల 30, జూన్ 01, 06, 08 తేదీలలో తిరుపతిలో, జూన్ 02, 09 తేదీలలో మదనపల్లిలో, జూన్ 05వ తేదీన పీలేరులో వెకేషన్ కోర్టు బెంచ్‌లను నిర్వహించనున్నట్లు న్యాయమూర్తి షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

జిల్లా క్రీడావిభాగం అధ్యక్షుడిగా మహమ్మదాలీ



పులిచెర్ల(కల్లూరు): లయన్స్ క్రీడా విభాగం జిల్లా అధ్యక్షుడిగా కల్లూరుకు చెందిన లయన్ మహమ్మదాలీ నియమితులయ్యారు. జిల్లా గవర్నర్ లయన్ రామరాజ్ అర్స్ గురువారం ఈ మేరకు నియామక పత్రం అందజేశారు. ఈ పదవిలో ఆయన ఏడాదిపాటు కొనసాగుతారు. గడిచిన ఎనిమిదేళ్లుగా ఈ పదవిలో ఆయన కొనసాగుతున్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రవాణా ఆదాయం పెంచాలి



ఎస్పీ రిశాంత్‌రెడ్డితో మాట్లాడుతున్న కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా

చిత్తూరు రూరల్: జిల్లా రవాణాశాఖ ఆదాయాన్ని పెంచేలా అధికారులు ప్రణాళికతో పనిచేయాలని రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా ఆదేశించారు. చిత్తూరు నగరంలోని డీటీసీ కార్యాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. తొలుత ఆటోమేటిక్ డ్రైవింగ్ ట్రాక్‌ను తనిఖీ చేశారు. ట్రాక్ పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత ట్రాక్‌లోని లోటుపాట్లు, సక్సెస్, ఫెయిల్యూర్ రేటుపై పరిశీలించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఇందుకు కర్నూలు డీటీసీ, పుంగనూరు ఎంవీఐ, పలమనేరు ఎంవీఐ, చిత్తూరులోని ఇద్దరు ఎంవీఐలతో కూడిన కమిటీని వేశారు. అనంతరం ఎస్పీ రిశాంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కాసేపు కార్యాలయంలో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో జేటీసీ బసిరెడ్డి, డీటీసీ నిరంజన్‌రెడ్డి, ఎంవీఐలు రాజేశ్వరరావు, వాసుదేవరెడ్డి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలపండి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఎంఈవోలకు పంపిన ఎస్జీటీ సీనియారిటీ జాబితాలో ఏవైనా అభ్యంతరాలున్నట్లైతే పరిశీలించి తెలపాలని డీఈవో విజయేంద్రరావు వెల్లడించారు. ఈ మేరకు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న 66 మండలాల్లో పనిచేస్తున్న ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా శాశ్వత ఉద్యోగోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ మేరకు తాజాగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జారీచేసిన ఉత్తర్వులను అనుసరించి కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి 12న జిల్లాలో పనిచేస్తున్న ఎస్జీటీలకు తాత్కాలిక ఉద్యోగోన్నతులు ఇచ్చామన్నారు. ప్రస్తుతం ఆ తాత్కాలిక ఉద్యోగోన్నతులను రద్దు చేసినట్లు వివరించారు. సంబంధిత సీనియారిటీ ఎస్జీటీల జాబితాను ఎంఈవోలకు పంపామని, వాటిని పరిశీలించుకుని ఏవైనా అభ్యంతరాలున్నట్లైతే ఈ నెల 19వ తేదీ లోపు తగిన ఆధారాలతో చిత్తూరు డీఈవో కార్యాలయంలో తెలియజేయాలన్నారు. గడువు తేదీ తర్వాత ఏవైనా అభ్యంతరాలొస్తే స్వీకరించేది లేదని డీఈవో తెలిపారు.

ఏఈలకు జీతాలు కట్?

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని 45 మంది ఏఈలు వర్క్‌ఆర్డర్లు ఈ నెలలోపు పూర్తి చేయకపోతే జీతాలు కట్ చేస్తామని ట్రాన్స్‌కో సీనియర్ అకౌంట్ ఆఫీసర్ (ఎస్‌ఏవో) శ్రీనివాసులు తెలిపారు. అర్బన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎస్‌ఏవో మాట్లాడుతూ, 2019–20 మధ్యలో రూ.4 కోట్లు విలువైన 500 వర్క్‌ఆర్డర్లను ఏఈలు క్లోజ్ చేయలేదన్నారు. ఈనెలలోపు వాటిని పరిష్కరించకపోతే జీతాలు ఆపివేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు వివరించారు. ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ బ్రహ్మచారి, ఈఈలు హరి, పద్మనాభపిళ్లై, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

లంచావతారం



- శ్రీరంగరాజపురం మండలం, శెట్టివానత్తానికి చెందిన రైతు సుబ్బారెడ్డి మృతి చెందారు. ఆయన పేరున ఉన్న ఎకరా 35 సెంట్ల భూమిని తన సోదరుడు మీద మార్చాలని సుబ్బారెడ్డి పెద్ద కుమారుడు నిర్ణయించాడు. సోదరుడి పేరు మీద పట్టాదారు పాసు పుస్తకం కోసం మ్యూటేషన్ దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలోనే తహసీల్దార్, వీఆర్వోలు కలిసి రూ.60 వేలు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. గత మార్చి 21న రూ.20వేలు లంచం తీసుకుంటూ శ్రీరంగరాజపురం తహసీల్దార్ షబ్బీర్ ఏసీబీకి చిక్కాడు.
- ఈ నెల 17న కుప్పం మండలంలో రూ.45 వేలు లంచం తీసుకుంటూ వీఆర్వో వెంకటేశ్ ఏసీబీకి దొరికాడు. 15 పాసుపుస్తకాలకు గాను రూ.1.5 లక్షలు డిమాండ్ చేసి దొరికిపోయాడు. న్యాయం చేయాలని రైతు కన్నప్పన్ పలు మార్లు బతిమాలినా వీఆర్వో కరుణించలేదు. లంచం ఇస్తే గానీ పాసుపుస్తకాలు మంజూరు చేయనని భీష్మించుకోవడంతో బాధితుడు కన్నప్పన్ ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. కన్నప్పన్ నుంచి వీఆర్వో వెంకటేశ్ నేరుగా నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

..ఇవి మచ్చుకు రెండు మాత్రమే.. ఇలాంటివి నెలకు ఒకటో రెండో జరుగుతూనే ఉన్నాయి. లంచాలకు అలవాటుపడ్డ అధికారులు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటూనే ముడుపుల బాగోతానికి తెరలేపుతున్నారు. అధికారులు ఎడాపెడా దాడులు చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీచేస్తున్నా పైసా వసూలు చేయకుండా ఆగలేకపోతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడమే వీరి అవినీతి అక్రమాలకు ప్రధాన కారణమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



శ్రీరంగరాజపురం తహసీల్దార్ కార్యాలయం

లంచాలకు కేరాఫ్ అడ్రస్‌గా తహసీల్దార్ కార్యాలయాలు

- అవినీతికి రోల్‌మోడల్‌గా పలువురు వీఆర్వోలు
- ముడుపులివ్వందే ఏపనీ కాదు
- ఉన్నతాధికారులు పట్టించుకుంటేనే!

సాక్షి, తిరుపతి/చిత్తూరు కలెక్టరేట్: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు పారదర్శకమైన పరిపాలన అందిస్తోంది. తమ సొంత గ్రామాల్లోనే సేవలు పొందేలా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను నెలకొల్పింది. పేదలకు మంచి చేయాలనే దృక్పథంతో పరిపాలన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలను కొందరు రెవెన్యూ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నీరుగారుస్తున్నారు. ముడుపుల కోసం చేయిచాచి రెవెన్యూ వ్యవస్థ పేరును పోగొడుతున్నారు. జిల్లాలోని కొన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో చిన్నచిన్న పనులకు కూడా ముడుపులు తీసుకుంటున్నారు. లంచాలివ్వకుంటే కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కరించకపోవడంతో ప్రజలు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమానికి పరుగులు పెడుతున్నారు. అక్కడి నుంచి ఛీవాట్లు వస్తున్నా అదరం..బెదరం.. అంటూ తిష్టవేసి రైతుల ముక్కుపిండి లంచాలు గుంజేస్తున్నారు. ఉన్నతాధికారులు నిత్యం తనిఖీలు చేస్తే తప్ప వారిలో బాధ్యత, అవినీతి రూపుమాపదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

పాసుపుస్తకం దరఖాస్తు వచ్చిందంటే పండగే

పట్టాదారు పాస్ పుస్తకం కోసం దరఖాస్తు వచ్చిందంటే రెవెన్యూ కార్యాలయంలో పండగే. కచ్చితంగా ఇంత డబ్బు వస్తుందని అధికారులు ముందుగానే లెక్కలు వేసుకుంటారు. మిగతా పనులన్నింటినీ పక్కన పెట్టి ముడుపుల ఫైల్‌ను పరుగెత్తిస్తారు. దాని వేగం సంబంధిత రైతు ఇచ్చే కరెన్సీ మీద ఆధారపడి ఉంటుంది. రెవెన్యూ సిబ్బంది దృష్టంతా దానిపైనే ఉంటుంది. రైతు ఆశ్చర్యపడే విధంగా పట్టాదారు పాస్ పుస్తకం అతని కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. కరెన్సీ ఉంటే క్షణాల్లో పనులు జరుగుతాయనేందుకు పట్టాదారు పాస్ పుస్తకాలే నిదర్శనం. ఆ ప్రాంత విలువ ఆధారంగా రేట్‌ను నిర్ణయిస్తుంటారు. ఎంత తక్కువగా చూసినా ఒక్కో పట్టాదారు పాస్ పుస్తకానికి దాదాపు రూ.20 వేల నుంచి రూ.లక్షకు తగ్గకుండా వసూలు చేస్తుంటారు. వీఆర్వో నుంచి దానిపై చివరి సంతకం చేసే అధికారి వరకు జేబులు నింపుకుంటారు.

ప్రాథమిక విచారణ నుంచే అసలు కథ

తొలుత వీఆర్వో ప్రాథమికంగా విచారణ చేయాలి. అక్కడ నుంచే నగదు చేతులు మారుతుంటాయి. సంబంధిత సర్వే నంబర్‌లో భూమి ఉందా, అడంగళ్‌లో ఎవరి పేరున ఉంది, కొనుగోలు చేసిన వారి పేరు ఉందా.. అన్న వివరాలు పరిశీలిస్తారు. తర్వాత ఆర్‌ఐ రంగంలోకి దిగుతారు. ఆయన కూడా దాన్ని పరిశీలించి.. తరువాత డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ టేబుల్‌పైకి పంపిస్తారు. చివరగా సంబంధిత ఆర్డీఓ కార్యాలయానికి కౌంటర్ సైన్ కోసం పంపిస్తారు. పట్టాదారు పాస్ పుస్తకాన్ని క్షుణంగా పరిశీలించి ఆర్డీఓ సంతకం కాగానే బయటకు వస్తుంది. ఈ తతంగమంతా జరగడానికి ఒక్కో రైతుకు భూమి విలువ ఆధారంగా లక్షల రూపాయలు ఇచ్చుకోవాల్సి వస్తోంది.

రుణం పొందాలంటే పాస్ పుస్తకం ఉండాల్సిందే

పంట రుణాలు, సబ్సిడీలు పొందాలంటే పాస్ పుస్తకాలు ఉండాల్సిందే. ఈ క్రమంలో దాదాపు జిల్లాలో 1,100 మంది రైతులు పట్టాదారు పాస్ పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అడంగల్ కాపీలో తప్పులు దొర్లాయంటే అక్కడి రెవెన్యూ అధికారులకు పండగే. కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాల మంజూరు కూడా రూ.500 నుంచి రూ.1000 ఆశిస్తున్నారు. మ్యూటేషన్ ఫైల్స్‌కు పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయాల్లో కొంతమంది వీఆర్వోలు నిజాయితీగా పనిచేస్తున్నా.. మరికొంత మంది ముడుపుల స్వీకరణకు కీరోల్‌గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఏసీబీ కేసులు ఇలా..

- 2020 జనవరి 25న అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని రేణిగుంట, వడమాలపేట మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో ఏసీబీ దాడులు నిర్వహించింది. అనధికార సొమ్మును సీజ్ చేసింది. రైతులు టైటిల్ డీడ్, ఈ పాస్‌పుస్తకం కోసం చేసుకున్న దరఖాస్తులను కారణం చూపకుండానే వీఆర్వోలు పెండింగ్‌లో పెడుతున్నట్లు గుర్తించారు.
- 2017 సెప్టెంబర్ 24న పూతలపట్టు తహసీల్దార్ సుధాకరయ్య రెండు లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.
- 2022 నవంబర్ 16న రూ.5 వేలు ఇస్తానని వెయ్యి రూపాయలే తెస్తావా..? అంటూ ఓ రైతును డిమాండ్ చేసిన అప్పటి తహసీల్దార్ రమణి వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. దీంతో ఆ తహసీల్దార్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.
- 2020 అక్టోబర్ 9లో వి.కోట తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో భానుమూర్తి రూ.2 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు.

ప్రజలకు తెలియజేసేది ఏమంటే?



చిత్తూరు, తిరుపతి జిల్లా ప్రజలకు ఏసీబీ తరుపున ముఖ్యంగా తెలియజేసేది ఏమిటంటే ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేసినా, అక్రమ ఆస్తులు కలిగి ఉన్నా వెంటనే తెలియజేయండి. ఏ ప్రభుత్వ కార్యాలయంలో అయినా లంచం అడిగితే భయపడకుండా తెలపండి. రాష్ట్ర ప్రభుత్వం ఫిర్యాదులు చేసేందుకు మొబైల్ యాప్‌ను ఏర్పాటు చేసింది. ఆడియో, వీడియో రికార్డు చేసి యాప్‌లో నమోదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. 14400 నెంబర్‌కు ఫిర్యాదు చేసి మా సహాయం పొందుతారని ఆశిస్తున్నాను.

– దేవప్రసాద్, ఏసీబీ అడిషనల్ ఎస్పీ

పేదల దైవం సీఎం జగన్



సభలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి

- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి వ్యాఖ్య

వెదురుకుప్పం: బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే ధ్యేయంగా పరితపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పాలిట ప్రత్యక్ష దైవమయ్యాడని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. మండలంలోని పచ్చికాపల్లం సమీపంలో గురువారం డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రసంగించారు. పేదల బాగుకోసం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తుంటే కడుపుమంటతో ప్రతిపక్షాలు ఎల్లో మీడియా ద్వారా నిత్యం బురదజల్లుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు అందిస్తున్న పథకాలను రద్దు చేసేందుకు దుష్టశక్తులు ఒక్కటయ్యాయని పేర్కొన్నారు. పొరబాటున చంద్రబాబు సీఎం అయితే ఈ పథకాలు ఒక్కటి కూడా పేదలకు దక్కకుండా చేస్తాడని చెప్పారు. పెత్తందార్ల కోసం బాబు అండ్‌కో పనిచేస్తే పేదల కోసం సీఎం జగన్ పనిచేస్తున్నారని స్పష్టం చేశారు.

జైలు కెళ్లడం ఖాయం

కరకట్ట అక్రమాల్లో సీఐడీ ఆస్తులను అటాచ్‌మెంట్ చేసిందని ఇష్టారాజ్యంగా చంద్రబాబు ప్రభుత్వ ఆస్తులను దోచి పెట్టినట్లు గుర్తించిందని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. అదేవిధంగా మార్గదర్శి మోసం కేసులో రామోజీరావుకు అక్రమాలు, అవినీతి ఉచ్చు బిగుసుకుంటోందని చెప్పారు. పేదలను మోసం చేసి పెత్తందార్లకు పంచిపెట్టిన వీరు జైలుకెళ్లడం ఖాయమని తెలిపారు. అమరావతిలో 50 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తే టీడీపీ ఎందుకు అడ్డుపడుతోందని ప్రశ్నించారు. గ్రామాల్లో కొందరిని రెచ్చగొట్టి వివాదాలు సృష్టిస్తున్నట్లు చెప్పారు.

రిజర్వాయర్లను అడ్డుకునేందుకే ఆరోపణలు

- నీతినిజాయితీకి మారుపేరు పెద్దిరెడ్డి కుటుంబం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి, పక్కన నాగభూషణం, అలీమ్‌బాషా

పుంగనూరు: పడమటి మండలాలకు సాగునీరు–తాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న రిజర్వాయర్లను అడ్డుకునేందుకే అసత్య ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన గురువారం మున్సిపాలిటీలో విలేకరులతో మాట్లాడారు. నీతి నిజాయితీకి మారుపేరు పెద్దిరెడ్డి కుటుంబమని, ఆయనపై ఆరోపణలు చేయడం తగదని హితవు పలికారు. నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తన అన్న కిరణ్‌కుమార్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో సీఐ పార్థసారథితో కలసి స్మగ్లింగ్ చేసి కోట్లాది రూపాయలు సంపాదించారని ఆరోపించారు. నేతిగుట్లపల్లె, ఆవులపల్లె వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్లపై ఆరోపణలు చేసి, వాటిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీసులతో మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తాగు–సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. ప్రాజెక్టుల వద్ద రైతులకు తగిన పరిహారం అందజేస్తున్నామన్నారు. ప్రాజెక్టులపై ఆరోపణలు చేస్తే ప్రజలు గ్రామాల్లో తిరగనివ్వకుండా అడ్డుకోవడం ఖాయమని చెప్పారు. ఇద్దరు సీఎంలు పుంగనూరు అభివృద్ధిని అడ్డుకున్న విషయం ప్రజలు గమనిస్తున్నారని, ఈ సారి తరిమి కొడతారని తెలిపారు. జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం మాట్లాడుతూ పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ మాట్లాడుతూ నల్లారి కిషోర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, నాయకులు రామ్మూర్తి, అంజిబాబు, చంద్రారెడ్డి యాదవ్, చెంగారెడ్డి, కళ్యాణ్, వరుణ్, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

నల్లారీ... నోరు అదుపులో పెట్టుకో

– ఎమ్మెల్సీ భరత్ ఘాటు విమర్శలు

రామకుప్పం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై నిరాధార ఆరోపణలు చేసిన టీడీపీ నేత నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి నోరు అదుపులో ఉంచుకోవాలని లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ హెచ్చరించారు. ఆయన గురువారం రామకుప్పంలో విలేకరులతో మాట్లాడుతూ కిషోర్ కుమార్ రెడ్డి తన అన్న కిరణ్‌కుమార్ రెడ్డి పదవిని అడ్డం పెట్టుకుని జిల్లాలోని అడవుల్లో చేసిన వ్యాపారాలు జిల్లావాసులకు తెలును అన్నారు. శేషాచల అడవిలో సంపదను దోచుకున్న ఘనత కిషోర్‌కే దక్కిందన్నారు. ఒక్కసారి ఎమ్మెల్యేగా కూడా గెలవని కిషోర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కమీషన్లకు కక్కుర్తిపడిన ఘనత కిషోర్‌ది అని తీవ్రంగా విమర్శించారు. కిరణ్‌కుమార్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో గార్గేయ నది పనులను నిలిపివేయడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఆ సమయంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గార్గేయ ప్రాజెక్టు కోసం పాదయాత్ర చేసిన సంగతి కిషోర్ గుర్తు చేసుకోవాలన్నారు. మంత్రిపై మరోసారి విమర్శలు చేస్తే జిల్లాలో కిషోర్ కుమార్ రెడ్డిని తిరగనివ్వమని ఎమ్మెల్సీ భరత్ హెచ్చరించారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి తప్పనిసరి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గృహ నిర్మాణాల పనుల్లో పురోగతి తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. ఆయన గురువారం పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో నిర్మిస్తున్న గృహాల్లో స్టేజ్ కన్వర్షన్ కచ్చితంగా జరగాలని చెప్పారు. పేదలందరికీ ఇల్లు కార్యక్రమం పురోగతిలో జిల్లా మెరుగైన స్థానంలో ఉందన్నారు. సామూహిక గృహ ప్రవేశాల నాటికి జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కృషి చేయాలని చెప్పారు. బీబీఎల్ నుంచి బీఎల్‌కు, బీఎల్ నుంచి ఆర్‌ఎల్‌కు ఇలా స్టేజ్ కన్వర్షన్ ఖచ్చితంగా జరగాలని స్పష్టం చేశారు. ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవడంతోపాటు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లక్ష్యాన్ని పూర్తి చేసేలా పర్యవేక్షించాలన్నారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ పద్మనాభం, వర్చువల్ విధానంలో ఎంపీడీఓలు హౌసింగ్ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

24వ తేదీ లోపు క్లెయిమ్స్

ఓటరుగా నమోదు చేసుకున్న వారి క్లెయిమ్స్‌లు అబ్జెక్షన్లను ఈ నెల 24వతేదీ లోపు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. విజయవాడ గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టర్ షణ్మోహన్, డీఆర్వో రాజశేఖర్, ఎన్నికల సిబ్బంది హాజరయ్యారు. ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ, రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఓటరుగా నమోదు చేసుకున్న వారి క్లెయిమ్స్, అభ్యంతరాలను ఈ నెల 24లోపు పూర్తి చేయాలన్నారు. ఎపిక్ కార్డులను ఓటర్లకు అందజేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2023 జనవరి 6న తుది ఓటర్ల జాబితా ప్రచురణ తరువాత నుంచి మార్చి 31 వరకు ఏడు నియోజకవర్గాల పరిధిలో చేర్పుల కింద 7,889, తొలగింపుల కింద 11317 క్లెయిమ్స్ అందాయని, 35,067 ఎపిక్ కార్డులు జనరేట్ అయినట్లు వివరించారు.

జగనన్న ఆణిముత్యాలు

- ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పది, ఇంటర్మీడియట్‌లో 2022–23 విద్యాసంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించి టాపర్‌లు గా నిలిచిన విద్యార్థులకు సర్కారు ప్రోత్సాహకాలను అందించనుంది. ఈ ప్రోత్సాహకాలకు రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న ఆణిముత్యాలు'గా పేరు ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ కార్యక్రమం విధి విధానాలపై గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన ప్రభుత్వ బడుల విద్యార్థులను అవార్డులు, నగదు పురస్కారాలతో సత్కరించనున్నారు. జెడ్పీ, ప్రభుత్వ, మున్సిపల్, ఏపీ మోడల్, బీసీ రెసిడెన్షియల్, ఏపీ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, జీటీడబ్ల్యూ ఆశ్రమ స్కూళ్లు, కేజీబీవీ విద్యార్థులకు ఈ అవకాశం కల్పించినట్లు డీఈవో విజయేంద్రరావు తెలిపారు. నియోజకవర్గంలో 1,2,3 స్థానాల్లోని విద్యార్థులకు వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందించనున్నారు. జిల్లా స్థాయిలో రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలు చొప్పున నగదు పురస్కారాలతో సత్కరించనున్నారు. ఈ నెల 25న నియోజకవర్గ స్థాయిలో ఉన్న మండల కేంద్రంలో, ఈ నెల 27న జిల్లా స్థాయిలో, ఈ నెల 31న విజయవాడలో రాష్ట్ర స్థాయిలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గంగమ్మ కోసం నిఘా కెమెరాలు ఉచితం



రాజేంద్రరెడ్డిని అభినందిస్తున్న సీఐ భాస్కర్

చిత్తూరు అర్బన్: చిత్తూరులో జరిగిన నడి వీధి గంగమ్మ జాతరలో బందోబస్తు కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, గాంధీ విగ్రహ కూడలిలోనే వీటిని పర్యవేక్షించే కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే పలమనేరుకు చెందిన యువకుడు గంగమ్మపై ఉన్న భక్తి, పోలీసుశాఖపై గౌరవంతో సీసీ కెమెరాలను మూడు రోజుల పాటు ఎలాంటి రుసుము వసూలు చేయకుండా ఉచితంగా ఏర్పాటు చేయడంతో గురువారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో యువకుడిని అభినందించారు. పలమనేరులో టిఎస్.అగ్రహారానికి చెందిన రాజేంద్రరెడ్డి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే యూనిట్‌ను నిర్వహిస్తున్నాడు. చిత్తూరు జాతరకు 16 సీసీ కెమెరాలు, ఓ మానిటర్, నైట్‌విజన్ హెచ్‌ఎస్ కేబుల్ సేవలను మూడు రోజుల పాటు పోలీసుశాఖకు అందించాడు. వీటన్నింటిని ఏర్పాటు చేస్తే రోజుకు రూ.లక్ష వరకు అద్దె చెల్లించాల్సి ఉంటుంది. దీంతో రాజేంద్రరెడ్డిని వన్‌టౌన్ సీఐ భాస్కర్ దుశ్శాలువతో అభినందించారు. పలమనేరు, పుంగనూరు జాతరలకు సైతం తన కెమెరాలను ఉచితంగా అందచేసినట్లు రాజేంద్రరెడ్డి తెలిపాడు.

రూ.20 లక్షల స్మార్ట్‌ఫోన్లు పట్టివేత

● ముగ్గురి అరెస్టు



పట్టుబడిన స్మార్ట్‌ఫోన్లు, నిందితులతో డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ చంద్రశేఖర్

పలమనేరు: ఫోన్లను చోరీలకు పాల్పడే ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, రూ.20 లక్షల స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ సుధాకర్ రెడ్డి గురువారం తెలిపారు. ఆయన అర్బన్ పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన పలమనేరు గంగజాతరలో కొందరి స్మార్ట్‌ఫోన్లు చోరీ అయినట్టు ఫిర్యాదులందాయన్నారు. దీనిపై కేసులు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పాతనేరస్తుల పనిగా గుర్తించారు. ఆ మేరకు పట్టణంలోని జెండామతానికి చెందిన బలరామ్ కుమారుడు సూరిబాబు(29)ని బుధవారం పట్టుకొని వారింట్లో తనిఖీ చేయగా, 108 స్మార్ట్‌ఫోన్లను గుర్తించారు. వీటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు అతన్ని విచారించగా తనతోపాటు పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీకి చెందిన యశ్వంత్‌సాయి(20), హైదర్‌వలీ కుమారుడు యూసూఫ్(19) కలసి గత కొన్నాళ్లుగా స్మార్ట్‌ఫోన్లను చోరీ చేసినట్టు ఒప్పుకున్నాడు. దీంతో వారిని సైతం పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు ముగ్గురూ కలసి పాత కార్లను బాడుగలకు తీసుకొని బస్టాండు, కూరగాయల మార్కెట్లు, బస్సులకోసం రాత్రిపూట వేచి ఉండేవారు. జాతరల్లో చాకచక్యంగా ఫోన్లను చోరీ చేసేవారు. వీరు చోరీ చేసిన ఫోన్లను పలమనేరుతో పాటు బంగారుపాళెం, చిత్తూరు, సోమల, బైరెడ్డిపల్లి, పు త్తూరు, తిరుపతి, నెల్లూరు, కడప, అన్నమయ్యజిల్లా రాయచోటి, తమిళనాడులోని పలుచోట్ల విక్రయించినట్టు డీఎస్పీ వివరించారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ సుబ్బారెడ్డిని ఆయ న అభినందించారు. స్థానిక క్రైమ్ పార్టీ ఏఎస్‌ఐలు దేవరాజులు, శ్రీనివాసులు, సిబ్బంది వేణు, అల్లాఉద్దీన్, ప్రకాష్, అశోక్, బాలాజీ, శశిలకు రివార్డు కోసం ఎస్పీకి సిఫార్సు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు.



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,350
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,665
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76

కుటుంబ సభ్యులతో గొడవపడి వ్యక్తి ఆత్మహత్య

పెద్దపంజాణి: కుటుంబ సభ్యులతో గొడవ పడిన వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం మేరకు, కొళత్తూరు గ్రామానికి చెందిన కృష్ణప్ప కుమారుడు మునిరాజ(45) బుధవారం రాత్రి మద్యం తాగి మోటర్ సైకిల్ విషయమై కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో కుటుంబీకులు తన మాట వినడం లేదని మనస్తాపంతో గ్రామ సమీపంలోని చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి క్రిష్టప్ప ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఒంటరిగా ఉండలేక..

కుప్పంరూరల్: వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు మోడల్ కాలనీకి చెందిన ఒంటరి మహిళ సులోచనమ్మ (80) గత కొంత కాలంగా మనోవేదనకు గురయ్యేది. ఈ క్రమంలోనే తాను ఉన్న ఇంటిలోనే ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని మృతి చెందింది. స్థానికులు సులోచనమ్మ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

బావిలో పడి వ్యక్తి దుర్మరణం



సుబ్రమణ్యం (ఫైల్)

వి.కోట: చేపలు పట్టడానికి వెళ్లి బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన మునివెంకటప్ప కుమారుడు సుబ్రమణ్యం (38) ప్రస్తుతం పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో జిరాక్స్ సెంటర్ నడుపుతున్నాడు. దయ్యాలపల్లి సమీపంలోని బావిలో చేపలు పట్టడానికి వెళ్లాడు. కాలు జారి బావిలో పడి మృతి చెందాడు. గ్రామస్తులు గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఆస్పత్రికి తరలించారు. మతునికి భార్య, పిల్లలు ప్రణీత, పూజిత, చేతన్ ఉన్నారు. మృతునికి ఈత రాదని బంధువులు తెలిపారు.

డీఈవో కార్యాలయానికి ఎంఈవో పంచాయతీ

చిత్తూరు కలెక్టరేట్ : నాడు-నేడు బిల్లుల అవకతవకలకు పాల్పడిన పెద్దపంజాణి ఎంఈవో హేమలతను ఇటీవల ఆర్జేడీ సస్పెండ్ చేశారు. సస్పెండ్ అయిన ఆ ఎంఈవో గురువారం ఆ సంఘ నాయకులతో కలిసి డీఈవో కార్యాలయానికి విచ్చేశారు. పెద్ద పంజాణి మండలంలోని యూటీఎఫ్ సంఘానికి మద్దతు గల ఒక టీచర్‌కు నోటీస్ ఇచ్చినట్లు డీఈవోకు వెల్లడించారు. అందుకు ఓర్వలేక ఆ టీచర్, యూటీఎఫ్ సంఘ నాయకులు తనపై అభియోగాలు చేసినట్లు చెప్పుకొచ్చారు. సస్పెండ్ విషయం తన పరిధిలోనిది కాదని ఉన్నతాధికారుల విచారణలో నిజాలు తేలడంతో చర్యలు తీసుకున్నారని డీఈవో సమాధానం ఇచ్చారు. చేసేదేమి లేక సస్పెండ్ అయిన పెద్ద పంజాణి ఎంఈవో హేమలత, ఎంఈవో సంఘ నాయకులు వెనుదిరిగారు.

నేటినుంచి వలంటీర్లకు వందనం

చిత్తూరు కార్పొరేషన్: ప్రభుత్వ పథకాలను ముంగిటకే అందజేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్లను సన్మానించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా కేంద్రంలో శుక్రవారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల సమక్షంలో వలంటీర్లకు అవార్డులను అందజేయనున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ,వార్డు సచివాలయాలకు ప్రజలకు వారధిలా పనిచేస్తున్న వీరి సేవలకు గుర్తింపుగా ఈనెల 19 నుంచి జిల్లాలోని అన్ని మండలాల్లో సన్మానించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో ఈకార్యక్రమాన్ని అదే రోజు ప్రారంభించనున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వలంటీర్లు అందిస్తున్న సేవలను గుర్తించిన ప్రభుత్వం సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర కేటగిరిలుగా ప్రశంసపత్రాలు, ప్రోత్సాహకంగా నగదును అందించేందుకు నిర్ణయం తీసుకుంది. సేవా మిత్రలుగా ఎంపికైన వారికి రూ.10వేలు, సేవారత్నకు రూ.20వేలు, సేవా వజ్రగా ఎంపికైనవారికి రూ.30 వేలను నగదు రివార్డుగా అందించనున్నారు.

జిల్లాలో అవార్డులు ఇలా

జిల్లాలో మొత్తం 9,346 మంది వలంటీర్లు ఉండగా అందులో 253 ఖాళీలు ఉన్నాయి. వీరిలో ఏడాది పూర్తి చేసుకొని పనిచేస్తున్న 8,408 మందికి అవార్డులివ్వనున్నారు. ఇందుకోసం రూ.8.65 కోట్లు ఖర్చు చేయనున్నారు. జిల్లాలో వజ్ర అవార్డుకు మొత్తం 31 మందిని ఎంపిక చేశారు. వీరికి రూ.9.3 లక్షలు ప్రోత్సాహం అందించనుంది. వలంటీర్ సేవా రత్న మొత్తం 182 మందికి రూ.36.40 లక్షలు మంజూరు చేసింది. జిల్లాలో 8,195 మంది వలంటీర్లకు సేవా మిత్ర కింద రూ.8.19 కోట్లు ప్రభుత్వం విడుదల చేయనుంది.

ఈ నెల 19 నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని రోజుకు రెండు గ్రామ, వార్డు సచివాలయాల్లో నిర్వహించాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించుకోవాలని ప్రభుత్వం తెలిపింది .

గోతిలోపడి రైతు మృతి

బంగారుపాళెం: మండలంలోని ఊటువంక వద్ద గురువారం గోతిలో పడి రైతు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన ప్రసాద్‌బాబు(57) పొలం వద్దకు వెళ్తుండగా ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనుల కోసం ఏర్పాటు చేసిన గోతిలో ఉన్న సిమెంట్ దిమ్మెపై పడి మృతి చెందాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మృతి చెందిన ప్రసాద్‌బాబు

పేకాట స్థావరంపై పోలీసుల దాడి



నిందితులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

వెదురుకుప్పం: మండలంలోని బ్రాహ్మణపల్లె అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు. పేకాట ఆడుతున్న వారి వద్ద రూ.1,11,380 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 9 సెల్ ఫోన్‌లు, 4 బైక్‌లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి పుత్తూరు కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

రైలు పట్టాలపై శవం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక దొడ్డిపల్లె షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న రైల్వే పట్టాలపై బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని యువకుడి మృతదేహం కనిపించింది. ఈ మేరకు సిబ్బంది శవాన్ని గుర్తించినట్లు రైల్వే ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. యువకుడు ఆత్మహత్య చేసుకొని ఉంటాడని అనుమానిస్తున్నట్లు వివరించారు.

జేసీజేల సెలవులకు అనుమతులు

తిరుపతి లీగల్ : జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులకు రాష్ట్ర హైకోర్టు వేసవి సెలవులు ప్రకటించడంతో ఈనెల 22వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు జూనియర్ సివిల్‌జడ్జిలు 11 రోజుల పాటు సెలవులపై వెళ్లడానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి భీమారావు అనుమతిలిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 22 నుంచి జూన్ 1వ తేదీ వరకు కొద్దిమంది జూనియర్ సివిల్‌జడ్జిలకు, జూన్ 2 నుంచి 12వ తేదీ వరకు మరికొంత మంది జూనియర్ సివిల్‌జడ్జిలకు సెలవుపై వెళ్లడానికి అనుమతులిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 22 నుంచి సెలవుపై వెళుతున్న వారిలో చిత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి బి.ఉమాదేవి, చిత్తూరు మొదటి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ఎం.మాధవి, చిత్తూరు 3వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి శ్రీనివాస్, పలమనేరు జూనియర్ సివిల్‌జడ్జి కె.రవి, కుప్పం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి షేక్ అరీఫా, మదనపల్లి 2వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్, పీలేరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.జ్యోతి, తిరుపతి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.సంధ్యారాణి, తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి గ్రంధి శ్రీనివాస్, పుత్తూరు అదనపు జూనియర్ సివిల్‌జడ్జి వీ.గోపాలకృష్ణ ఉన్నారు. ఆయా కోర్టులకు చిత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి, మొదటి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులకు చిత్తూరు ప్రత్యేక మొబైల్ మెజిస్ట్రేట్ కీర్తన, చిత్తూరు 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు చిత్తూరు 4వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి షేక్ బాబాజాన్, పలమనేరు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు పుంగనూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి జి.కార్తీక్, కుప్పం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు కుప్పం అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ఎం.ఎస్ భారతి, మదనపల్లి 2వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు మదనపల్లి మొదటి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి షేక్ ఆసీఫా సుల్తానా, పీలేరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు పీలేరు అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.గాయత్రి, తిరుపతి 3వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి బి.వాణీశ్రీ, తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు తిరుపతి ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీకాంత్, పుత్తూరు అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు పుత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి సి.జానికి ఇన్‌చార్జ్ జడ్జిలుగా వ్యవహరించాలని జిల్లా జడ్జి ఉత్తర్వుల్లో తెలిపారు. అలాగే జూన్ 2 నుంచి 12వ తేదీ వరకు సెలవుపై వెళ్లనున్న జడ్జిలలో చిత్తూరు 4వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి షేక్ బాబాజాన్, పుంగనూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి జి.కార్తీక్, చిత్తూరు ప్రత్యేక మొబైల్ కోర్టుకు జడ్జి ఎ.కీర్తన, పుంగనూరు అదనపు జూనియర్ సివిల్‌జడ్జి జి.సింధు, కుప్పం అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్ భారతి, మదనపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఎ.మంజులత, తంబళ్లపల్లి జూనియర్ సివిల్‌జడ్జి ఉమర్ ఫరూఖ్, పీలేరు అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.గాయత్రి, తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి బి.వాణీశ్రీ, తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కే.వీ సత్యకాంత్‌కుమార్, తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పి.కోటేశ్వరరావు, తిరుపతి 5వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి వై.సరిత, తిరుపతి ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.శ్రీకాంత్, పుత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి సి.జానకి, శ్రీకాళహస్తి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి జె.కృష్ణప్రియ ఉన్నారు. ఆయా కోర్టులకు పుంగనూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, పుంగనూరు అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులకు పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి కె.రవి, కుప్పం అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు కుప్పం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మదనపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు మదనపల్లి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, తంబళ్లపల్లి జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు మదనపల్లి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, పీలేరు అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు పీలేరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.జ్యోతి, తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు తిరుపతి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు తిరుపతి 4వ అనదపు జూనియర్ సివిల్‌జడ్జి, తిరుపతి 5వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు తిరుపతి 3వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి, తిరుపతి ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి, పుత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు పుత్తూరు అదనపు జూనియర్ సివిల్‌జడ్జి, శ్రీకాళహస్తి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు తిరుపతి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరించాలని జిల్లా జడ్జి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.